వినాయక నిమజ్జన ఉత్సవాలపై కలెక్టర్ సమీక్ష

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): వినాయక నిమజ్జనం వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, అధికార యంత్రాంగం తరపున అవసరమైన పూర్తి సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. సోమవారం కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ అఖిల్ మహాజన్ తో కలిసి ఆయన పాల్గొన్నారు. నిమజ్జన సమయంలో అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా అధికారులు హైఅలర్ట్‌లో ఉండాలన్నారు. మున్సిపల్, పంచాయతీ, ఆర్ అండ్ బీ, ఎక్సైజ్, విద్యుత్ తదితర శాఖలు సమన్వయంతో పని చేయాలన్నారు. 9, 11 రోజుల్లో బెల్ట్ షాపులు పూర్తిగా మూసి వేయాలని ఆదేశించారు. క్రేన్‌లు, గజ ఈతగాళ్లు, ఎన్‌సీసీ టీం లను సిద్ధంగా ఉంచాలన్నారు. ప్రజలు ఎటువంటి అపోహలను నమ్మకుండా ప్రశాంతంగా వేడుకలను జరుపుకోవాలని సూచించారు. సమావేశంలో డీఎస్పీ జీవన్ రెడ్డి, ట్రైనీ కలెక్టర్ సలోని, ఆర్‌డీం స్రవంతి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగల నుంచి చెట్ల కొమ్మలు తొలగింపు

● 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

ఉట్నూర్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): 'విద్యుత్ తీగలను తాకిన చెట్టు కొమ్మలు' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో సోమవారం ప్రచురించిన వార్తకు ట్రాన్స్‌కో అధికారులు స్పందించారు. మండలకేంద్రంలో విద్యుత్ తీగలను తాకి ఉన్న చెట్ల కొమ్మలతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడకుండా.. వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా చేయడానికి ట్రాన్స్‌కో సిబ్బంది చెట్ల కొమ్మలను తొలగించడం జరిగింది. దీంతో అక్కడి వజీర్ ప్రాంత వాసులు హర్షం వ్యక్తం చేశారు.



చెట్ల కొమ్మలను తొలగిస్తున్న ట్రాన్స్‌కో సిబ్బంది



● జిల్లాకేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆదివాసీలు(ఫైల్)

ఏజెన్సీలో.. మళ్లీ టెన్షన్

- సుప్రీం కోర్టును ఆశ్రయించిన భద్రాచలం ఎమ్మెల్యే, ఆదిలాబాద్ మాజీ ఎంపీ
- ఎస్టీ జాబితా నుంచి లంబాడాలను తొలగించాలి అంటూ డిమాండ్
- గిరిజన తెగల మధ్య ముదురుతున్న రిజర్వేషన్ వివాదం

తెర పైకి ఆదివాసీ, లంబాడాల ఆధిపత్య పోరు

గత కొన్నేళ్లుగా ఆదివాసీ, లంబాడా తెగల మధ్య ఆధిపత్యపోరు కొనసాగుతోంది. ఈ క్రమంలోనే ఎస్టీ జాబితా నుంచి సుగాలి, బంజార, లంబాడాలను తొలగించాలంటూ భద్రాచలం ఎమ్మెల్యే తెలగం వెంకట్రావ్, ఆదిలాబాద్ మాజీ ఎంపీ సోయం బాపురావ్‌లు సుప్రీం కోర్టును ఆశ్రయించడంతో ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా ఏజెన్సీలో మళ్లీ టెన్షన్ మొదలయ్యింది.

ఆదిలాబాద్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గత దశాబ్ద కాలంగా సైలెంట్‌గానే కనిపిస్తున్న ఆదివాసీల ఉద్యమం మళ్లీ తెరపైకి రావడం చర్చనీయాంశంగా మారింది. ఆదివాసీలు తమ హక్కుల కోసం పోరాటాలు, ఆందోళనలు చేస్తూ వస్తున్నారు. 2017 నవంబరు, డిసెంబరు మాసాలలో ఆదివాసీల ఉద్యమం ఉధృతంగా మారింది. అప్పట్లో ఉట్నూర్ మండలం హస్నాపూర్ హింసాత్మక ఘటన రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. దీంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కదిలాయి. ఆ తర్వాత ఉద్యమానికి నాయకత్వం వహించిన మాజీ ఎంపీ సోయం బాపురావ్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కులు ఎన్నికల్లో గెలుపొందడంతో ఉద్యమం కొంత సైలెంట్‌ైపోయింది. తాజాగా ఆదివాసీ, లంబాడాల వివాదం పై సుప్రీంకోర్టు స్పందించడంతో మళ్లీ చర్చనీయాంశంగా మారింది.

నెరవేరని హామీలు

ఉద్యమ తీవ్రతతో ఆదివాసీలను శాంతింపచేసేందుకు గత ప్రభుత్వం పలు హామీలు ఇచ్చింది. అయినా ఇప్పటి వరకు ఏ ఒక్క హామీని నెరవేర్చ లేదు. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతంలోని

(తరువాయి 6వ పేజీలో....)

ఆ మూడు తెగల వారు ఎస్టీలు కారు : గోడం గణేష్, తుడుందెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్



లంబాడ, బంజారా, సుగాలి మూడు తెగలకు చెందిన వారు అసలు ఎస్టీలే కారు. గతంలో అధికారంలో ఉన్న ప్రభుత్వాలు మైదాన ప్రాంతంలో 149 జీవోతో చదువుల కోసం వారిని ఎస్టీలో చేర్చారు. ఇదంతా చట్ట విరుద్ధం. 1976కు ముందు బీసీ సర్టిఫికెట్లను పొంది ఉద్యోగాలు పొందిన దాఖలాలు ఉన్నాయి. వీరిని వెంటనే ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తున్నాం. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి ఇక్కడ ఎస్టీలుగా చలామణి అవుతున్నారు.

చట్ట ప్రకారమే మా పోరాటం : సోయం బాపురావు, మాజీ ఎంపీ, రాష్ట్ర రాజ్‌గోండు సేవా సమితి అధ్యక్షుడు, ఆదిలాబాద్



రాజ్యాంగం కల్పించిన హక్కులను దక్కించుకునేందుకు చట్ట ప్రకారం పోరాటం చేస్తున్నాం. గతంలో ఎన్నో పోరాటాలు చేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోలేదు. దీంతో సుప్రీం కోర్టును ఆశ్రయించాల్సి వచ్చింది. 5వ షెడ్యూల్‌లో లేని లంబాడా, బంజారా, సుగాలి తెగలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలన్నదే మా ప్రధాన డిమాండ్. సుప్రీంకోర్టుపై పూర్తి విశ్వాసం ఉంది. ఆదివాసీలకు అనుకూలంగానే తీర్పు వస్తుందని భావిస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వం వాస్తవ పరిస్థితులను పరిగణలోకి తీసుకుని సుప్రీం కోర్టుకు నివేదికను అందించాలి.



ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు

● ప్రజావాణిలో అర్జీలను స్వీకరించిన కలెక్టర్

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రజావాణి లో అందే సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ రాజర్షి షా అన్నారు. పట్టణంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రజావాణి ఫిర్యాదుల విభాగంలో ఆయన పాల్గొని వినతులు స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను వినతుల రూపంలో అందించారు. ప్రజావాణిలో మొత్తం 84 దరఖాస్తులు అందినట్లు కలెక్టర్ తెలిపారు. వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా ఎప్పటికప్పుడు వాటిని పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ట్రైనీ కలెక్టర్ సలోని పాల్గొన్నారు.



గ్రీవెన్స్‌లో వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

గిరిజనుల సమస్యలపై ప్రత్యేక దృష్టి

● ఇన్‌చార్జి ఏపీవో దామోదర్ స్వామి

ఉట్నూర్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి):ఉమ్మడి జిల్లాలోని గిరిజనుల నుంచి వచ్చిన దరఖాస్తులను పనిష్కరిష్కరించడంలో అధికారులు సమన్వయంతో ప్రత్యేక దృష్టిసారించడం జరుగుతుందని సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ఇంచార్జ్ ఏపీవో దామోదర్ స్వామి అన్నారు. సోమవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన గిరిజనుల అర్జీలను స్వీకరించారు. పింఛన్లు, ఇందిరమ్మ ఇండ్లు, రైతుభరోసా, స్వయం ఉపాధి పథకాలు మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన వివిధ రకాల సమస్యలను పరిష్కరించాలని దరఖాస్తుదారులు సమర్పించారు. ఈ సందర్భంగా ఏపీవో అధికారులు త్వరితగతిన చర్యలు తీసుకోవాలన్నారు. ఏపీవో (పీవీటీజీ) మెస్రం మనోహర్, పీహెచ్‌వో గుడిమల్ల సందీప్ కుమార్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



అర్జీలను స్వీకరిస్తున్న ఇన్‌చార్జి ఏపీవో దామోదర స్వామి

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

● అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి

మావల, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య అందుతుందని విద్యార్థులు చదువు, ఆటలపై దృష్టి సారించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని అడిషనల్ కలెక్టర్ శ్యామల దేవి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని కేఆర్కే కాలనీ ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. ఈ మేరకు ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయురాలు శృతి కమల్ కిషోర్ తమ కూతురు లక్ష్మి ఆదిత్య జ్ఞాపకార్థం పిల్లలకు ప్లేట్లను అడిషనల్ కలెక్టర్ శ్యామల దేవి చేతుల మీదుగా పంపిణీ చేశారు. అదే విధంగా పాఠశాలకు రెండు బెంచీలు, కుర్చీలు ఫర్నిచర్ అందచేసిన జిల్లా విశ్వ బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింగ్‌ను సైతం అభినందించారు. ఇందులో ప్రధానోపాధ్యాయుడు నర్రా నవీన్ యాదవ్, ఉపాధ్యాయులు షేక్ అలీ, శ్రీరామ్, నీలమ్మ, సునీత శృతి,శ్రావణి, యాసమీన్, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్లేట్లను అందజేస్తున్న అడిషనల్ కలెక్టర్

ఇన్‌చార్జి ఎంపీడీవోగా జీవన్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ

ఇంద్రవెల్లి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండల ఇన్‌చార్జీ ఎంపీడీవోగా జీవన్ రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఆయన మండల ఎంపీవోగా విధులు నిర్వహిస్తున్నారు. సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు ఆయనను సన్మానించారు. పంచాయతీ ఈవో సంజీవ్ రావు, తదితరులున్నారు.

పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలి : తహసీల్దార్

తలమడుగు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): పండుగలను శాంతి సామరస్యాలతో జరుపుకోవాలని తహసీల్దార్ రాజమోహన్ కోరారు. సోమవారం వినాయక చవితి సందర్భంగా రెవెన్యూ కార్యాలయంలో ప్రతిష్ఠించిన మహాగణపతి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఇందులో మాజీ జడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ ప్రభాకర్, ఆర్‌ఐలు రోహిదాస్, అశోక్, మాజీ జడ్పీటీసీ బాపన్న, రమేష్ రెడ్డి, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య

తాంసి రూరల్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ కళాశాల లక్ష్యం అని తాంసి ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపక బృందం అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ప్రతీ విద్యార్థి తప్పనిసరిగా కళాశాలకు వచ్చేలా విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించాలన్నారు.

బీసీ బిల్లు ఆమోదం చరిత్రాత్మక విజయం

- ● తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి
- ● జిల్లాలో కాంగ్రెస్ శ్రేణుల సంబురాలు

మావల, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ సమావేశాలలో స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీల బిల్లు ఆమోదం పొందడం చరిత్రాత్మక విజయమని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి అభివర్ణించారు. సోమవారం బోరంచు శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులతో కలిసి సంబరాల్లో పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో రాజ్యాంగ నిర్మాత డా బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుల చిత్రపటానికి పాలతో అభిషేకం చేసి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మునిగేల నర్సింగ్, మావల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ధర్మపురి చంద్ర శేఖర్, యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వేముల నాగరాజు, మాజీ టౌన్ అధ్యక్షుడు ఎండీ వసీం, తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్ టౌన్: అసెంబ్లీలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లు ఏకగ్రీవ ఆమోదం పట్ల జిల్లా కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో ప్రజాసేవ భవన్ నుంచి సోమవారం పెద్ద ఎత్తున హాజరైన కాంగ్రెస్ శ్రేణులతో ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వానికి మద్దతుగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. బాణసంచా కాల్చి స్వీట్లు పంచుకొని సంబరాలు చేసుకున్నారు. అనంతరం ముఖ్యమంత్రితోపాటు మంత్రులు, కాంగ్రెస్ ప్రముఖుల ఫ్లెక్సీకి పాలతో అభిషేకం చేశారు. నాయకులు జహీర్ రంజాని, రూపేష్ రెడ్డి, రామ్ కుమార్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



రాహుల్ గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటాలకు పాలతో అభిషేకం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

ఉట్నూర్: స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 42 శాతం రిజర్వేషన్లు ప్రకటించడంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు సంబరాలు నిర్వహించుకున్నారు. సోమవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ ఇక్బాల్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు స్వీట్లు పంచుకొని, బాణసంచా పేలుస్తూ సంబరాలు నిర్వహించారు.ఈ సందర్భంగా మొహమ్మద్ ఇక్బాల్, లింగంపల్లి చంద్రయ్య, ఆత్రం రాహుల్‌లు మాట్లాడారు. ఏఎంసీ వైస్ చైర్మన్ బానోత్ జయవంతరావు, జగదీష్ జాదవ్, జిల్లా ఆర్టీఏ సభ్యులు దూట రాజేశ్వర్, రవి, మహమ్మద్ హర్షద్, కొత్తపల్లి మహేందర్, అచ్చానందం, గుడిపల్లి నర్సయ్య, ఏకేఆర్, చిలువేరు లింగన్న, తదితరులు పాల్గొన్నారు.


ఇంద్రవెల్లి: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేసే బిల్లుకు అసెంబ్లీ ఆమోదం తెలపడంతో మండల కాంగ్రెస్ నేతల ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ చిత్రపటానికి పాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం బాణాసంచా కాల్చి, స్వీట్లు తినిపించుకుని సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ ముఖడే ఉత్తం మాట్లాడారు. మాజీ వైస్ ఎంపీపీ పద్వాల్ గోపాల్ సింగ్, పడ్ వరుణ్ పటేల్, సీనియర్ నాయకుడు మీర్జా యాకూబ్ బేగ్, పట్టణ అధ్యక్షులు ఎండీ జహీర్, సోమోరే నాగోరావు, ఎండీ జునైద్, తదితరులు పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్: స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతానికి రిజర్వేషన్లు పెంచుతూ సవరణ బిల్లును శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించిన నేపథ్యంలో కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో సోమవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్ర పటానికి పాలతో అభిషేకం చేసి సంబురాలు జరుకున్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ మల్లెపూల నర్సయ్య మాట్లాడారు. పార్టీ అధ్యక్షుడు జల్కె పాండురంగ్, బత్తిని కిషన్, నారాయణ, రఘున్ రెడ్డి, పాండురంగ్, రజాక్, గంగాధర్, తదితరులు ఉన్నారు.

ఏకదంతాయ.. విభిన్న రూపాయ!!

- ● జిల్లాకేంద్రంలో ఆకట్టుకుంటున్న భారీ సెట్టింగులు
- ● విశేషంగా ఆకట్టుకుంటున్న వినాయక ప్రతిమలు

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వినాయక నవరాత్రి ఉత్సవాల శోభ నెలకొంది. ముఖ్యంగా పట్టణంలోని ఆయా కాలనీలలో విభిన్న రూపాలలో ప్రతిష్ఠించిన వినాయక ప్రతిమలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. కళా నైపుణ్యం ఉట్టిపడేలా రూపొందించిన సెట్టింగులు ఆహుతులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. గణనాథులను దర్శించుకునేందుకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివస్తున్నారు.



కుమార్ జనత గణేష్ మండలి ఆధ్వర్యంలో భారీ వినాయకుడు



చింతామణి గణేష్ మండలి వారి..



దత్తాత్రేయుడికి భోజనం వడ్డిస్తున్న గణేశుడు



డైనమిక్ యూత్ ఆధ్వర్యంలో ఆపరేషన్ సిందూర్ వినాయకుడు




భుక్తాపూర్‌లో తిరుమల ఆలయం సెట్టింగ్




కన్యకా పరమేశ్వరి ఆలయంలో ప్రయాగ్‌రాజ్‌లో మహా కుంభమేళా నాటి దృశ్యాలతో భారీ సెట్టింగ్



సార్వజనిక్ గణేష్ మండలి ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన భారీ గణపతి



భుక్తాపూర్‌లో అమర్‌నాథ్ ఆలయం సెట్టింగ్



వంశీ గణేష్ మండలి ఆధ్వర్యంలో...



దోభి కాలనీలో అశ్వ వాహనుడైన గణ నాథుడు



దోభి కాలనీలో గజ వాహనంపై లంబోదరుడు


పూజల్లో పాల్గొన్న సొసైటీ చైర్మన్ డోంగ్రే మారుతి పటేల్

గ్రామాల్లో ఘనంగా గౌరీ పూజలు

ఇంద్రవెల్లి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా సోమవారం మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో గౌరీ మహాలక్ష్మి దేవి పూజలు ఘనంగా నిర్వహించారు. మహారాష్ట్ర సంప్రదాయ పద్ధతిలో ఈ పండుగను గణేష్ చతుర్థి సందర్భంగా జరుపుకుంటారు. ఈ పండుగ వివాహిత మహిళలు జరుపుకుంటారు. సౌభాగ్యాలను ప్రసాదించే గౌరీ పండుగను వివాహిత మహిళలు జరుపుకుంటారు. గౌరీ దేవిని ఆరాధించడం వల్ల సుఖ, సంతోషాలతో పాటు ఆనందం, సంపద, సుదీర్ఘ జీవితాన్ని ఇస్తుందని, తన భర్తను ఆయుష్మును పెంచి ఆశీర్వదిస్తుందని వారి నమ్మకం, మహాలక్ష్మీదేవి సంపద, శ్రేయస్సు, ఐశ్వర్యాల దేవత కాబట్టి, ఆమె అనుగ్రహం పొందడానికి ప్రజలు ఇళ్లను శుభ్రం చేసి, అలంకరించి, తీపి పదార్థాలు, పండ్లు, తామర పువ్వులు వంటివి నైవేద్యంగా సమర్పించారు. సొసైటీ చైర్మన్ డోంగ్రే మారుతి పటేల్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బాసర ఆలయ ఈవోగా అంజనాదేవి

బాసర, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): బాసర సరస్వతీ అమ్మవారి ఆలయ నూతన ఈవోగా అంజనాదేవిని నియమిస్తూ దేవాదాయ శాఖ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల విడుదలయిన జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు భైంసా అడిషనల్ కలెక్టర్ అజ్మీర సంకేత్‌కుమార్‌ను ఆలయ ప్రత్యేకాధికారిగా నియమించగా, దేవాదాయ శాఖ కలెక్టర్ ఉత్తర్వులను రద్దు చేస్తూ, నూతన ఈవోగా అంజనాదేవిని నియమించింది.

భూ నిర్వాసితులకు పరిహారం చెల్లించాలి

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): పిప్పల్ కోటి రిజర్వాయర్ భూనిర్వాసిత రైతులకు నష్టపరిహారం రెట్టింపు చేసి వెంటనే చెల్లించాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ డిమాండ్ చేశారు. భూనిర్వాసిత రైతులతో కలిసి కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లేష్ మాట్లాడుతూ.. ఏడు ఏళ్ల కిందట ఇవ్వాల్సిన నష్టపరిహారం ఇప్పటి వరకు చెల్లించక పోవడం అన్యాయమన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అన్నమొల్ల కిరణ్, జిల్లా కమిటీ సభ్యులు ఆర్.మంజుల, గ్రామ కార్యదర్శి ధొనిపెల్లి స్వామి, నాయకులు లింగాల చిన్నన్న, గంగాసాగర్ గ్రామ రైతులు ఎస్కే. నశీరుద్దీన్, అశోక్, పెంటన్న, మామిడి నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని రిమ్స్, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో ఐహెచ్ఎఫ్ఎంఎస్ విభాగంలో పనిచేస్తున్న శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ గార్డులకు సంబంధించి రెండు నెలల వేతనాలు వారి ఖాతాల్లో జమ చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ డిమాండ్ చేశారు. రిమ్స్ కార్మికులతో కలిసి సోమవారం నిరసన చేపట్టారు. నాయకులు పండుగ పొచ్చన్న, సుమన్ తాయి, ఎస్.దశాంత్, కే.రమేష్, రాజమణి, భాగ్యశ్రీ పాల్గొన్నారు.

రీసెర్చ్‌కు ఎంపికైన మోడల్ స్కూల్ విద్యార్థి

నార్నూర్ రూరల్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఇని?ట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసర్చ్‌కు నార్నూర్ మోడల్ స్కూల్ విద్యార్థి రాథోడ్ అలేఖ్య బీఎస్ఎంఎస్ డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రాంకి ఎంపికైనట్లుగా ప్రిన్సిపాల్ ఎం.ప్రశాంత్ తెలిపారు. సోమవారం పాఠశాల సిబ్బంది శాలువాతో సన్మానం చేసి శుభాకాంక్షలు చెప్పారు.

సీపీఎస్ వద్దు.. ఓపీఎస్ ముద్దు

● ఉపాధ్యాయ సంఘాల నిరసనలు


● ఉట్నూర్‌లో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

ఉట్నూర్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): సీపీఎస్ వద్దు, ఓపిఎస్ ముద్దు అంటూ ఉపాధ్యాయ సంఘాల నాయకులు నిరసనలు తెలిపారు. సోమవారం ఉట్నూర్ కేంద్రంలో ఉపాధ్యాయుల జాక్టో రాష్ట్ర నాయకులు పీజీ టీటీఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జాదవ్ చంద్రకాంత్ ఆధ్వర్యంలో నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్నా.. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పెరుగుతూనే ఉన్నాయన్నారు. అలాగే సీపీఎస్ రద్దు చేస్తామని హామీలు ఇస్తున్నారు కానీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పరిష్కరించడం లేదన్నారు. ఓపిఎస్ అనేది ఉద్యోగ ఉపాధ్యాయులకు రాజ్యాంగం కల్పించిన హక్కు అని, ఇది ప్రభుత్వం ఇచ్చే భిక్ష కాదన్నారు. ఇకనైన ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపిఎస్ ఓల్డ్ పెన్షన్ విధానం అమలు చేసి ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన అన్ని బకాయిలు వెంటనే విడుదల చేయాలని జాక్టో రాష్ట్ర శాఖ పక్షాన ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జాక్టో ఉపాధ్యాయ సంఘాల రాష్ట్ర నాయకులు శీతల్ చౌహాన్, జిల్లా నాయకులు జాదవ్ రవీందర్, రాథోడ్ దినేష్, బానోత్ రవీందర్, అమృతరావు జాదవ్, మురళి, అశోక్ పవార్, గజేందర్, ప్రదీప్, సురేందర్, ఇందల్ సింగ్ రాథోడ్, రవీందర్, మోహన్, బానోత్, చిన్న బాపు, సవిత, జయకుమారి, దుర్గత, పుష్ప లత, తదితరులు పాల్గొన్నారు. ఇది ఇలా ఉండగా మండలంలోని లక్కెట్టిపేట గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల ఆవరణలో టిపిటిఎఫ్ ఆధ్వర్యంలో నవంబరు 1 విద్రోహ దినంగా పాటిస్తూ నిరసన తెలిపారు. ఆ సందర్భంగా టి పిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఆత్రం భుజంగ రావు మాట్లాడారు.

భీంపూర్: తెలంగాణ సర్కార్ ఉద్యోగ ఉపాధ్యాయుల భవిష్యతు కోసం సిపిఎస్ విధానాన్ని రద్దు తక్షణమే రద్దు చేయాలని పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు గంపల ప్రభాకర్ అన్నారు. ఆయన సోమవారం పీఆర్‌టియు ఉపాధ్యాయులతో కలిసి హైదరాబాద్‌లో చేపట్టిన ధర్నాలో పాల్గొన్నారు. ప్రభుత్వం ఈ విధానం రద్దు చేసే వరకు ఆందోళనలు చేస్తూనే ఉంటామని ఆయన పేర్కొన్నారు. ప్రతినిధులు జంగిలి శ్రీనివాస్, సంతోష్, తదితరులు ఉన్నారు.

ఆదిలాబాద్ టౌన్: ఎన్నికల సందర్భంగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల జేఏసీ నాయకులు సంద అశోక్ అన్నారు. సీపీఎస్ రద్దు చేయాలన్న డిమాండ్‌తో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం విద్రోహ దినంగా పాటిస్తూ పట్టణంలో ఆందోళన నిర్వహించారు. స్థానిక టీఎన్జీవోస్ భవనం నుంచి నల్ల బ్యాడ్జీలు ధరించి ర్యాలీ చేపట్టి ప్రధాన కూడళ్ల గుండా కలెక్టరేట్‌కు చేరుకున్నారు. కలెక్టర్ కార్యాలయ ప్రధాన గేటు ఎదుట ధర్నా నిర్వహించి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు అశోక్ మాట్లాడారు. ఇందులో జేఏసీ నాయకులు నవీన్, అరుణ్, శివకుమార్, రవీందర్, శ్రీనివాస్, కిష్టయ్య పాల్గొన్నారు.

అసెంబ్లీలో వర్షం బాధిత రైతులపై చర్చ లేకపోవడం శోచనీయం : రామన్న

తలమడుగు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలతో పంటలు నష్టపోయిన రైతుల గురించి అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వం చర్చించకపోవడం శోచనీయమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత వారం రోజుల క్రితం భారీ వర్షాలతో ఈడాది ఎకరాల్లో పంట నష్టం జరిగి ఆర్థికంగా నష్టపోయిన రైతుల గురించి వరద బాధితుల గురించి అసెంబ్లీ సమావేశాల్లో చర్చించకపోవడం బాధాకరమన్నారు. కాంగ్రెస్ నాయకులకు పదవులు తప్ప ప్రజా సమస్యలు పట్టవన్నారు. కేవలం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను విమర్శించడం తప్ప సీఎం రేవంత్ రెడ్డి చేసింది ఏమీ లేదన్నారు. ప్రభుత్వం వెంటనే పంటలు నష్టపోయిన రైతులందరికీ ఎకరానికి రూ.25 వేల పంట నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఇందులో బీఆర్ఎస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకులు కాటిపల్లి వసంత రెడ్డి, మండల కన్వీనర్ తోట వెంకటేష్, రైతు సంఘం నాయకులు శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ రామ్ కిషన్, తదితరులున్నారు.

దళితవాడలో విద్యుత్ సమస్య

బోథ్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): సోనాల మండల కేంద్రంలో దళితవాడలో గత 15 రోజుల కాలంగా విద్యుత్ సరఫరా వినియోగదారులను ఇబ్బంది చేస్తుందని కాలనీవాసులు వాపోతున్నారు. మండల కేంద్రంలోని ఒకటి, రెండు వార్డులలో ఈ సమస్యను నెలకు ఉందని అంటున్నారు. సోమవారం ఉదయం7.30 గంటల నుంచి మూడు గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిందని కాలనీవాసులు పేర్కొంటున్నారు.

మళ్లీ దంచి కొట్టిన వర్షం

● ఉప్పొంగిన తలమడుగు వాగు.. నిలిచిన రాకపోకలు
● రాత్రి 8 గంటల వరకు మండల కేంద్రంలోనే అధికారులు

తలమడుగు సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడ ప్రభావంతో మళ్లీ సోమవారం వర్షం దంచి కొట్టడంతో మండలంలో వాగులు వంకలు ఉప్పొంగి ప్రవహించడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. ముఖ్యంగా మండల కేంద్రంలోని తలమడుగు పెద్దవాగు ఉప్పొంగి ప్రవహించడంతో రాత్రి 8 గంటల వరకు తహసీల్దార్ రాజమోహన్ తో పాటు రెవెన్యూ సిబ్బంది మండల పరిషత్ సిబ్బంది కార్యాలయాల్లోనే ఉండవలసిన పరిస్థితులు ఏర్పడ్డాయి. అదే విధంగా వాగుల సమీపంలోని వ్యవసాయ పొలాల్లో మళ్లీ వర్ష వర్షపు నీరు రావడంతో పంట పొలాలు నీట మునిగాయి. భారీ వర్షాలతో నష్టపోయిన రైతులందరికీ ప్రభుత్వం మరోసారి సర్వే నిర్వహించి నష్ట పరిహారం అందజేసే విధంగా చూడాలని రైతులు కోరుతున్నారు.

రాహుల్‌గాంధీ ఆశయ సాధనకు కృషి

సిరికొండ రూరల్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో రాహుల్‌గాంధీ కలలు కన్న ఆశయాలు త్వరలోనే నెరవేరబోతున్నాయని బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ అన్నారు. సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించిన ఆయన రాష్ట్రంలో రిజర్వేషన్ల అమలు కోసం 50 శాతం నిబంధన ఎత్తివేస్తూ బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేసినందుకు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

ఏజెన్సీలో.. మళ్లీ టెన్షన్

(5వ పేజీ తరువాయి...)

ఆదివాసీల విద్యుత్ బిల్లుల మాఫీ, ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు, విద్యా, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు, ఏజెన్సీలో ప్రత్యేక డీఎస్సీని నిర్వహించక పోవడంతో ఆదివాసీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అవకాశాలన్ని లంబాడా సామాజిక వర్గానికే దక్కుతున్నాయంటూ తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. అప్పట్లో ఏజెన్సీ ప్రాంతంలో పని చేస్తున్న గిరిజన ఉద్యోగులను గుర్తించాలని ప్రభుత్వం 23 శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఇందులో వ్యవసాయ శాఖ, పశు సంవర్ధక శాఖ, విద్యాశాఖ, బీసీ, ఎస్సీ సంక్షేమ శాఖ, రెవెన్యూ, అటవీ, ఉద్యానవన, హౌజింగ్, డీఆర్‌డీఏ, దేవాదాయ, ఉపాధి, మత్స్య, ఆర్అండ్‌బి, నీటి పారుదల, లేబర్, బ్యాంక్, అగ్ని మాపక ప్రధాన శాఖలతో పాటు వివిధ శాఖలున్నాయి. శాఖల వారీగా ఆదివాసీ, లంబాడా ఉద్యోగుల వివరాలను సేకరించినా ఎలాంటి ప్రయోజనమే లేకుండా పోయింది. ఆ తర్వాత జీవో 3ను ఎత్తి వేయడంతో ఆదివాసీలు అసంతృప్తికి గురయ్యారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ కూడా ఆదివాసీలను పెద్దగా పట్టించుకోక పోవడంతో ఆదివాసీలు మళ్లీ సుప్రీం కోర్టును ఆశ్రయించారు.

తొలగించాలంటూ పట్టు

ఎస్టీ జాబితా నుంచి లంబాడాలను తొలగించాలంటూ ఆదివాసీలు పట్టుబడుతున్నారు. ముఖ్యంగా 5వ షెడ్యూల్‌లో లేని ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన లంబాడా, సుగాలి, బంజారా మూడు తెగలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలంటూ డిమాండ్ చేస్తున్నారు. ఈ తెగలకు చెందిన వారిని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1976కు ముందు ఎస్టీలుగా పరిగణించ లేదని, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి ఆదివాసీల హక్కులు, అవకాశాలను పొందుతున్నారని సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. గతంలో వీరిని బీసీలుగా పరిగణించామని సుప్రీం కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన సుప్రీం కోర్టు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఈ విషయమై సమాధానం ఇవ్వాలంటూ నోటీసులు ఇవ్వడం ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. దీంతో ఏజెన్సీలోని గిరిజన తెగల మధ్య మళ్లీ వివాదానికి దారి తీసే అవకాశం కనిపిస్తుంది.

ఆందోళనకు దిగిన వారిపై కేసు

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పోలీసు చట్టం 30 అమల్లో ఉన్నప్పటికీ.. ఎలాంటి అనుమతులు లేకుండా ఆందోళనలకు పూనుకున్న 20 మందిపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఆదిలాబాద్ టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ కే.నాగరాజు తెలిపారు. సాత్నాల మండలం సలాయితండాకు చెందిన చౌహాన్ కమలాబాయి చేనులో మృతి చెందగా శవ పరీక్ష కోసం రిమ్స్ మార్చురీకి గత నెల 30న తరలించారన్నారు. ఆమె మృతికి రెవెన్యూ అధికారులే కారణమంటూ ఆ రోజు రిమ్స్ శవాగారం వద్ద, కలెక్టర్ కార్యాలయం ముందు ఆమె బంధువులు ఆందోళనలు చేపట్టారని, పోలీసుల విధులకు ఆటంకం కలిగించారన్నారు. ఈ మేరకు టూ టౌన్ ఎస్సై విష్ణుప్రకాష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇరవై మందిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన పీఏసీఎస్ డైరెక్టర్

సిరికొండ రూరల్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): సిరికొండ మండలానికి చెందిన పులువురు బీఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకులు బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆడే గజేందర్ సమక్షంలో సోమవారం కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా గజేందర్ వారికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతర రాష్ట్రంలోని బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లు ఆమోదం చరిత్రాత్మక నిర్ణయమని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆడే గజేందర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు అమలు చేస్తున్న పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో పెద్ద ఎత్తున చేరికలు జరుగుతున్నాయని తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కలిసి కట్టుగా కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఇచ్చోడ మార్కెట్ కమిటీ చైర్మన్ కుంరం సత్యవతి కోటేష్, బోథ్ బ్లాక్ ఆత్మ చైర్మన్ గొర్ల రాజు యాదవ్, మండల అధ్యక్షులు షేక్ ఇమామ్, బోథ్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దం పోత రెడ్డి, మాజీ జడ్పీటీసీ చంద్రకళ రఘురామ్, ఏఎంసీ డైరెక్టర్‌లు జగన్, ప్రకాష్, ఆనంద్ రావు, మాధవ్ పటేల్, తదితరులు పాల్గొన్నారు.

పేకాట ఆడుతున్న తొమ్మిది మందిపై కేసు

నర్సాపూర్(జి), సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్(జి) మండల కేంద్రంలోని ఎస్‌బీఐ కాలనీలో ఆదివారం అర్ధరాత్రి పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ. 59,950 నగదుతో పాటు 9 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. స్థానిక ప్రజల నుంచి అందిన సమాచారం మేరకు నర్సాపూర్(జి) ఎస్సై గణేష్ తన సిబ్బందితో కలిసి ఆ కాలనీలో ఓ ఇంటిపై ఆకస్మిక దాడి చేశారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని పోలీసులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్సై గణేష్ తెలిపారు ఇటువంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

కోతుల్‌గాంలో స్వయంభు గణపతి మహారాజ్ దర్శనం తీసుకున్న యువనేత

భైంసా రూరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోతుల్‌గాం గ్రామంలో కొలువైన స్వయంభు గణపతి మహారాజ్ దర్శనం బాజీరావు తీసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ వీడీసీ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు రమేష్ గౌడ్, చందు రెడ్డి, తిరుపతి, ఆనంద్ రావు పటేల్, రాజన్న, సట్ల భూమేష్, ఆమెడ గజ్జన్న, శంకర్, రతన్‌లు యువ నేత బాజీ రావుని స్వాగతించి సన్మానించారు. బాజీరావుతో పాటు బీజేపీ మండల నాయకులు సట్ల సాయి, అశోక్ బండారి, రాజేశ్వర్, రమేష్ రెడ్డి, సత్యనారాయణలున్నారు.

మన పాఠశాల - మన ఆత్మ గౌరవం

లక్ష్మణచాంద, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మన పాఠశాల - మన ఆత్మ గౌరవం పేరుతో మండలంలోని ఆయా పాఠశాలల్లో సోమవారం ప్రతిజ్ఞ చేశారు. పాఠశాలను క్రమ శిక్షణతో పరిశుభ్రంగా ఆకు పచ్చగా స్ఫూర్తి దాయకంగా ఉంచుతామని, పాఠశాల, పాఠశాల వనరులను జాతీయ సంపదగా గుర్తించి వాటిని కాపాడుతామని, విద్య ద్వారా పొందిన జ్ఞానాన్ని వ్యక్తిత్వ నిర్మాణం, స్వీయ అభివృద్ధి, సామాజిక సేవకు ఉపయోగిస్తామని, పాఠశాలలో వివక్షత లేని వాతావరణాన్ని సృష్టిస్తామని, పాఠశాలను సేవాభావం, అంకిత భావం కలిగిన దేవాలయంగా పరిగణిస్తామని ఆ ప్రతిజ్ఞలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులందరూ పాల్గొన్నారు.

గణిత విజ్ఞాన సంస్కృతి మేళాలో మెరిసిన శిశు మందిర్ విద్యార్థులు

ముధోల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్‌లోని శ్రీ సరస్వతి శిశు మందిర్ వినాయక్‌చౌక్ పాఠశాలలో ఆగస్టు 31, సెప్టెంబరు 1 తేదీలలో శ్రీ సరస్వతి విద్యాపీఠం ఆధ్వర్యంలో జరిగిన ఆదిలాబాద్ విభాగ్ స్థాయి (ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలు) గణిత విజ్ఞాన సంస్కృతి మేళాలో ముధోల్ మండల కేంద్రంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచినట్లు ప్రధానాచార్యులు సారథి రాజు తెలిపారు. 38 మంది విద్యార్థులు బాలవర్గ, కిశోరవర్గాలలో ప్రదర్శనలు, ప్రయోగాలు, క్విజ్‌లు, పత్ర సమర్పణ మొదలగు అంశాలలో పాల్గొన్నారని తెలిపారు. ఆచార్యులు గంగామణి, అఖిల, రమేష్‌లకు ప్రధానాచార్యులు శుభాకాంక్షలు తెలిపారు.

పుస్తకావిష్కరణ

తానూర్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం తానర్‌లో సోమవారం ముధోల్ నియోజక వర్గ ఉద్యమకారుల చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. స్థానిక వాగ్దేవి విద్యానికేతన్ పాఠశాలలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షులు డా. ముష్కం రామకృష్ణగౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై ఈ పుస్తకాన్ని ఆవిష్కరించాడు. ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ లక్ష్యాలను సాధించడానికి అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పుస్తక రచయిత జాదవ్ పుండ్లీక్‌రావు పాటిల్, ఉద్యమకారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీపీఎస్ విధానం రద్దు చేయాలని నిరసన


తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం


దిలావర్‌పూర్‌లో నల్ల బ్యాడ్జీలతో నిరసన

దస్తురాబాద్/దిలావర్‌పూర్/నిర్మల్‌టౌన్/ఖానాపూర్/నిర్మల్‌రూరల్ సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో ఉద్యోగులు సోమవారం పెన్షన్ విద్రోహదినం సందర్భంగా తహసీల్దార్ బత్తుల విశ్వంబర్‌కు వినతిపత్రం అందజేశారు.

దిలావర్‌పూర్ : పాతపెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ దిలావర్‌పూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు.

నిర్మల్‌టౌన్ : సీపీఎస్‌ను వెంటనే రద్దు చేయాలని కోరుతూ స్థానిక జుమ్మెరాత్‌పేట్ గవర్నమెంట్ హైస్కూల్‌లో టీచర్లు మధ్యాహ్న భోజన సమయంలో నిరసన వ్యక్తం చేశారు. నల్ల బ్యాడ్జీలు ధరించి వారు ఈ నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం ఇన్‌చార్జి హెడ్ మాస్టర్ దత్తురాం మాట్లాడుతూ... ఆయనతో పాటు సీపీఎస్ సంఘ నాయకుడు బోస్లే గంగాధర్, తదితరులు ప్రసంగించారు.కార్యక్రమంలో హెడ్‌మాస్టర్ దత్తురాంతో పాటు టీచర్లు నడికుడ గంగాధర్, మల్లేశం, శ్రీమంత్, దయానంద్, మనోహర్, శ్రీనివాస్ రెడ్డి, కమర్, శ్రీనివాస్, వినోద్ కుమార్, రమణ, మంజుల, నాగలత, హేమలత, విజయలక్ష్మి,శృతి పాల్గొన్నారు.

ఖానాపూర్ : సీపీఎస్‌ను రద్దు చేయాలని ఖానాపూర్‌లో టీజీఈ జేఏసీ ప్రభుత్వ ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. సోమవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఖానాపూర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ... సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని స్థానిక తహసీల్దార్ సుజాతకు అందజేశారు. టీయూటీఎఫ్ నిర్మల్ జిల్లా ప్రధాన కార్యదర్శి వాయిద్ ఖాన్, తదితరులున్నారు.

నిర్మల్ రూరల్ : సీపీఎస్ ఉద్యోగుల భవిష్యత్తును దెబ్బతీస్తోందని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ నాయకులు అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం జేఏసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ... సీపీఎస్ జీవన భద్రతకు హాని కలిగిస్తుందని, వృద్ధాప్యంలో కనీస భరోసా కలిగించే పాత పెన్షన్ విధానమే శాశ్వత పరిష్కారమన్నారు.


జుమ్మెరాత్‌పేట్ గవర్నమెంట్ స్కూల్‌లో నిరసన


తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయులు

కాల్వ దేవస్థానం జూనియర్ అసిస్టెంట్‌కు సన్మానం


సత్కరిస్తున్న అర్చకులు

దిలావర్‌పూర్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కాల్వ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో జూనియర్ అసిస్టెంట్‌గా సేలందిస్తూ సోమవారం పదవీ విరమణ చేసిన మనోహర్‌ను గ్రామస్థులు, భక్తులు ఘనంగా సన్మానించారు. దేవాలయ అభివృద్ధికి మనోహర్ చేసిన సేవలను గుర్తు చేశారు. అంకిత భావంతో పని చేసి భక్తుల మెప్పు పొందారని పలువురు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ... ఉద్యోగ పరంగానే విరమణ తీసుకున్నప్పటికి వ్యక్తిగతంగా భక్తులకు, నరసింహ స్వామికి సేవలు చేసుకుంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో భూమయ్య, చైర్మన్ మహేందర్, పాలక వర్గం సభ్యులు, దేవాదాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు ఇళ్లు దగ్ధం


వివరాలు తెలుసుకుంటున్న ఆర్ఐ

ముధోల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బోరిగాం గ్రామానికి చెందిన లక్ష్మీ అనే మహిళ ఇళ్లు సోమవారం ఉదయం ప్రమాదవశాత్తు దగ్ధమైంది. సుమారు రూ.65 వేల వరకు ఆస్తినష్టం జరిగినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. స్థానికులు, రెవెన్యూ అధికారుల కథనం ప్రకారం... బాధితురాలు తన ఉన్న ఇంట్లోని దేవుళ్లకు దీపం ముట్టించి ఇతర గ్రామానికి బయలుదేరింది. ప్రమాదవశాత్తు ఆ దీపం ఇంటికి తగిలి మంటలు అంటున్నాయి. ఈ విషయాన్ని గమనించిన స్థాని కులు బాధితురాలికి ఫోన్‌చేసి మంటలు చుట్టుపక్కల వ్యాపించకుండా నీళ్లను పోసి చల్లార్చారు. ఇంట్లో ఉన్న బట్టలు, ఆహారధాన్యాలు, నగదు రూ.20 వేలు తదితరవి కాలిబూడిదయ్యాయి. విషయం తెలుసుకున్న ఆర్ఐ నారాయణ పటేల్ సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల వివరాలను అడిగి తెలుసుకున్న పంచనామా నిర్వహించారు. సుమారు రూ.65 వేల వరకు ఆస్తినష్టం వాటిల్లినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని బాధితురాలు వేడుకుంటుంది.

వరదప్రభావిత ప్రాంతాలు పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే

తానూర్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురిసిన వర్షాలకు వరద ప్రభావిత ప్రాంతాలలో సోమవారం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ, మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణ్‌రావుపాటిల్ పర్యటించారు. అతిగా కురిసిన వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. మండలంలోని జౌల(కే), బోల్సా, తొండాల, మహాలింగి గ్రామాలలో వర్షం వలన దెబ్బతిన్న సోయా, పత్తి పంటలను పరిశీలించారు. అదే విధంగా బోల్సా పమీంలో వరదతాకిడికి ధ్వంసమైన బ్రిడ్జి రోడ్డు, తొండాల మహాలింగి గ్రామాల్లో వరద ప్రభావంతో కొట్టుకుపోయిన రోడ్లు పంటలను పరిశీలించారు. సంబంధిత అధికారులు గ్రామాలలో పర్యటించి జరిగిన నష్టాన్ని అంచనా వేసి నివేదికలను పంపించాలని, ఎవరు కూడా బాధపడకూడదని, అధైర్యపడొద్దని ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఇన్‌చార్జీ మంత్రి జూపల్లికృష్ణా రావు ఆధ్వర్యంలో సీఎం దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వ సహాయం అందేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శంకర్‌చంద్రే, ముత్యంరెడ్డి, తానూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు హెచ్.పుండ్లీక్, మాజీ ఎంపీపీ చంద్రకాంత్, మాజీ ఎంపీపీ చంద్రకాంత్, సాధశివ్ పాటిల్, మాజీ కో-ఆప్షన్ గోవిందర్‌పాటిల్, మాజీ ఎంపీపీ మధుపాటిల్, అట్బల్ దేవిదాస్, సాజిత్ తదితరులున్నారు.

నీట మునిగిన పంట పరిశీలన

బాసర, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : బాసర మండలంలో సోమవారం టీఆర్ఎస్ నాయకులు డాక్టర్ కిరణ్ కొమ్రేవార్ పర్యటించారు. వర్షాల కారణంగా నీట మునిగిన రైతుల పంటలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి నష్టాన్ని తెలుసుకున్నారు. ప్రభుత్వం వెంటనే రైతులకు నష్టపరిహారం అందించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.


వరద బాధితులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే

హరీశ్‌రావు, సంతోష్‌రావు

అవినీతి అనకొండలు

(మొదటిపేజీ తరువాయి)



మీడియా మిత్రులతో రకరకాలుగా చెప్పించారు. సోషల్ మీడియా ద్వారా ఇప్పటివరకు నాపై జరిగిన పర్సనల్ ఎటాక్‌ను ఓర్చుకుంటూ వచ్చాను. ఇంతవరకు పేరు పెట్టి చెప్పలేదు. ఇప్పుడు మొదటిసారి చెబుతున్నా. దేవుడి లాంటి మా నాన్నపై సీబీఐ విచారణ చేస్తామంటుంటే.. ఒక బిడ్డగా కడుపు రగిలిపోతోంది. అందుకే చెబుతున్నా" అని అన్నారు.

ఇంకా వాళ్లనే మోస్తారా?

"హరీశ్‌రావు, సంతోష్. కేసీఆర్ పక్కన ఉండి, ఆయన పేరు చెప్పుకొని అనేక విధాలుగా లబ్ధి పొందారని కవిత తెలిపారు. వారి చర్యల వల్లే కేసీఆర్ పేరు బద్నామ్ అయ్యే పరిస్థితి వచ్చింది. అయినా వాళ్లనే మోస్తామని, వాళ్లనే మళ్లీ ముందుకు తీసుకెళ్తామని అనుకుంటే.. పార్టీ ఎలా ముందుకుపోతుందని ప్రశ్నించారు. "ఒక బిడ్డగా నేను బాధపడుతున్నా. ఐదేళ్లు ఇరిగేషన్ మంత్రిగా చేసిన హరీశ్‌రావుకు ఇందులో మేజర్ పాత్ర లేదా? మా నాన్న పరిస్థితి నేను దగ్గరుండి చూశాను. నా పెళ్లికి డబ్బుల కోసం ఆయన ఎంత ఇబ్బంది పడ్డారో నాకు తెలుసు. రాజకీయాల్లో 40, 50 ఏళ్లు ఉన్నా.. కేసీఆర్ ఆస్తులు సంపాదించుకోలేదు. నాకు తెలిసి ఆయనకు డబ్బుపై ఎన్నడూ ఆశలేదు. అలాంటి వ్యక్తిపై సీబీఐ విచారణ చేస్తామని, కేసులు వేస్తామని అంటే.. ఇందుకు ఎవరు కారణం? ఈ వయసులో ఆయనపై సీబీఐ కేసులేంటి? ఏం ఖర్మ? ఇలాంటి వాళ్లను ఎందుకు భరించాలి? ఎందుకు ప్రొటెక్ట్ చేయాలి? బీఆర్ఎస్ తమ్ముళ్లకు నాపై కోపం రావచ్చు. వాస్తవాలు చేదుగా ఉన్నా.. మందులాగా అప్పుడప్పుడు మాట్లాడితేనే ఆరోగ్యంగా ఉంటుంది" అని కవిత వ్యాఖ్యానించారు.

హరీశ్, సంతోష్ వెనక రేవంత్‌రెడ్డి..

కాంగ్రెస్ ప్రభుత్వం చేతకాని ప్రభుత్వమని కవిత మండిపడ్డారు. ఏసీబీ ముగ్గురు కాళేశ్వరం ఇంజనీర్లను పట్టుకుంటే, ఒక్కో ఇంజనీరు దగ్గర వందల కోట్ల ఆస్తులు బహిర్గతమైతే.. విచారణ చేసే దమ్ము ప్రభుత్వానికి లేకుండాపోయిందని ధ్వజమెత్తారు. వారి వెనకాల ఎవరున్నారని ప్రశ్నించారు. "హరీశ్‌రావు, సంతోష్‌రావు వెనక రేవంత్‌రెడ్డి ఉండి కాపాడుతున్నారు. బాణం గురి ఎంతసేపూ కేసీఆర్‌పైనే ఉంది. అందుకే అన్ని విషయాల్లో వాళ్లను ఏమీ అనరు. వాళ్ల గురించి మాట్లాడరు. ఈ అవినీతి అనకొండలతో రేవంత్‌కు ఉన్న రహస్య ఒప్పందం బహిర్గతం కావాలి. పీసీ ఘోష్ కమిషన్ నివేదికలో ఏముందో చెప్పకుండానే టక్కున సీబీఐకి ఇస్తామనడం ముందస్తు కుట్ర. కేసీఆర్ ప్రతిష్ఠను దెబ్బతీయడమే వారి లక్ష్యం. మీరు బట్టకాల్చి మీదవేసినట్లు ఆరోపణలు చేయడం కాదు. నేను డిమాండ్ చేస్తున్నా.. పేర్లు కూడా చెప్పాను. దమ్ము ధైర్యం ఉంటే వారిపై విచారణ చేయించాలి. వాస్తవాలు బయటపెట్టి వారితో అండర్‌స్టాండింగ్ లేదని నిరూపించుకోవాలి" అని కవిత సవాల్ చేశారు.

ఎవరో చెబితే ఆడే తోలుబొమ్మను కాదు..!

తాను తన తండ్రికి రాసిన లేఖను లీక్ చేసిన సందర్భంలో అసలు విషయాలు బహిర్గతం చేసినందుకు 90 రోజులుగా తనను దుష్ప్రచారాలతో వేధిస్తున్నారని కవిత తెలిపారు. ఇప్పుడు కాళేశ్వరం విషయంలో వాస్తవాలు మాట్లాడినందుకూ వాళ్ల సోషల్ మీడియా బ్యాచ్‌లు రేపటి నుంచి అడ్డగోలు విమర్శలు చేస్తాయన్నారు. "నన్ను బీజేపీ ఆపరేట్ చేస్తుందంటారు. కాంగ్రెస్ ఆపరేట్ చేస్తుందంటారు. ఒకరు రేవంత్‌రెడ్డి చెబితే మాట్లాడుతుందని, మరొకరు బండి సంజయ్ చెబితే మాట్లాడుతుందంటూ దుష్ప్రచారం చేస్తారు. ఖబడ్దార్ బిడ్డా.. నేను ఎవరో చెబితే ఆడే తోలుబొమ్మను కాదు. నాది కేసీఆర్ రక్తం.. తెలంగాణ బ్లడ్. వ్యక్తిగతంగా నేను అనుకున్న విషయాన్ని చెబుతున్నా. దానికి రాజకీయంగా ఇబ్బంది అయినా, నష్టమయినా, కష్టమయినా.. నేనే భరిస్తా" కవిత స్పష్టం చేశారు.

ఇలాంటి పార్టీ ఉంటే ఏంది? పోతే ఏంది?

దేశంలో ఎక్కడికి వెళ్లినా.. కేసీఆర్ మహానాయకుడు అంటారని కవిత తెలిపారు. ఇప్పుడు సీబీఐ విచారణ జరిపితే.. ఏం మాట్లాడతారని ప్రశ్నించారు. "మా నాన్న పరువు పోతే నాకు బాధ. మీకా? వాళ్లకు పైసలు కావాలె. పేరుతో ఏం పని? ఇంక కూడా ఇటువంటి విషయాలు అర్థం చేసుకోకుండా, ఇలాంటి వ్యక్తులను దూరం పెట్టకుంటే.. ఇలాంటి పార్టీ ఉంటే ఏంది? పోతే ఏంది? బీఆర్ఎస్ నాయకులు నన్ను తిట్టుకున్నా సరే. స్థానిక ఎన్నికల్లో నష్టం జరుగుతదని అనుకున్నా సరే. మా నాన్నమీద సీబీఐ విచారణ పడ్డాక ఏముంది? ఎలక్షన్‌లో ఒకరు గెలుస్తరు, ఒకరు ఓడిపోతరు. అసలు పార్టీ ఓడిపోయే పరిస్థితి ఎందుకు వచ్చింది? ఇటువంటి దుర్మార్గుల వల్ల కాదా? ఈ అంటే.. మా దగ్గర పైసలున్నయని, టీవీలున్నయని, సోషల్ మీడియాలుయని ఎటు పడితే అటు మాట్లాడతామంటే తోలు తీస్తం. గీత గీసుకుంటం బిడ్డా. మీరు ఒక కామెంట్ పెడితే.. మేం పది పెడతాం. ఇంతకాలం చూస్తూ ఊరుకున్నా. పెద్ద సారు దగ్గరికి వచ్చాక ఇక కాంప్రమైజ్ అయ్యేది లేదు. నిజంగానే ఆయన అవినీతికి పాల్పడితే వేరుమాట. కేసీఆర్‌కు ఎప్పుడూ తెలంగాణ ధ్యాసే.. అదే పిచ్చి. అలాంటి వ్యక్తిపై ఏది పడితే అది మాట్లాడితే.. రియాక్ట్ కాకపోవడం చాలా దారుణం. సీబీఐ విచారణ చేస్తున్నామని రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ప్రకటిస్తే.. తెలంగాణ బంద్‌కు పిలుపు ఇవ్వొద్దా? తెలంగాణ భగ్గుమనొద్దా? దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నా. ఏదేమైనా సీబీఐ విచారణ చేసినా.. కేసీఆర్ కడిగిన ముత్యంలా బయటకు వస్తారు" కవిత పేర్కొన్నారు.

మూడు పిల్లర్లు కుంగిపోతే రెండున్నరేళ్లుగా లొల్లి!

కేసీఆర్ తరతరాలకు తరగని ఆస్తిలా కట్టిన కాళేశ్వరాన్ని బద్నామ్ చేస్తున్నారని కవిత అన్నారు. "మహాసముద్రం లాంటి కాళేశ్వరంలో చిన్న పార్ట్ అయిన మేడిగడ్డలో మూడు పిల్లర్లు కుంగిపోతే.. ప్రాజెక్టు మొత్తం కూలిపోయిందని రెండున్నరేళ్లుగా లొల్లి పెడుతున్నారు. నేను 2006 నుంచి తెలంగాణ ఉద్యమంలో పాల్గొంటూ రాజకీయాల్లో యాక్టివ్‌గా ఉన్నాను. అప్పటినుంచి ఇప్పటివరకు ప్రజల విషయం తప్ప.. వ్యక్తిగత విషయాలు మాట్లాడరు. అటువంటి మహానాయకుడు అవినీతికి పాల్పడ్డారని, లక్ష కోట్లు దోచుకున్నారని, నిజాం కన్నా ధనికుడు కావాలనుకున్నారని అంటున్నారు. అవును కచ్చితంగా నిజాం బాటలోనే నడుస్తాం. నిజాం కట్టిన ఉస్మాన్‌సాగర్ నీళ్లే కదా.. నేటికీ హైదరాబాద్ ప్రజలు తాగుతున్నది! ఆ నిజాం స్ఫూర్తి అని మా నాన్న చాలాసార్లు చెప్పారు. కచ్చితంగా 200 ఏళ్లు తెలంగాణ ప్రజలు కాళేశ్వరం ప్రాజెక్టును కట్టిన కేసీఆర్‌ను తలుచుకుంటారు. కేసీఆర్‌కు ఉన్న అవగాహన, ఉమ్మడి ఏపీలో ఆయన అనుభవించిన వివక్ష, తెలంగాణకు వ్యతిరేకంగా పనిచేసిన ప్రస్తుత సీఎంకు తెలియదు. నేటికీ ఆయన పక్క రాష్ట్రం ఎజెండాను అమలు చేస్తున్న వ్యక్తి. బనకచర్ల కడతామంటే మాట్లాడని వ్యక్తి.. కేసీఆర్ గురించి అసెంబ్లీలో ఉదయం నుంచి రాత్రి వరకు అనరాని మాటలు అంటుంటే నా గుండె బరువెక్కింది. ఇదే రేవంత్‌రెడ్డి గతంలో ఓ టీవీ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, 'కేసీఆర్‌కు పైసల మీద ఆశలేదు. పాపం ఆయన మీటింగ్ పెట్టాలంటే కూడా.. అప్పుడు పైసల గురించి చూస్తారు' అన్నారు. అటువంటి ఆలోచన ఉన్న వ్యక్తిమీద ఇంత కుట్రపూరితంగా అభాండాలు ఎందుకు వేస్తున్నారు? ప్రజలు తిరగబడతారనుకుంటే.. ప్రభుత్వం తప్పులు బయటపడతాయంటే.. కేసీఆర్‌పై ఆరోపణ చేయాలి. ఆయన పేరు చెప్పకుంటే రేవంత్‌రెడ్డి ఫొటో కూడా పేపర్లో వేయరని ఆయన్ను విమర్శిస్తున్నారు. సెప్టెంబర్ 30లోపు ఎన్నికలు పెడతామని, 50శాతం రిజర్వేషన్లు ఎత్తేస్తామని అంటున్నారు. రాహుల్‌గాంధీ బిహార్ ఎన్నికల ప్రచారం కోసం బీసీ రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ రోజుకో కొత్తకథ చెబుతోంది. గవర్నర్ వద్ద పెండింగ్ పెడితే.. సుప్రీంకోర్టుకు ఎందుకు వెళ్లడంలేదు? బిహార్ ఎన్నికల కోసమే బీసీ బిడ్డలను రేవంత్‌రెడ్డి బలి పెడుతున్నారు. ఇలాగే చేస్తే.. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా బిహార్‌కు వెళ్లి ప్రచారం చేస్తాం" అని కవిత హెచ్చరించారు.

కవిత

సస్పెన్షన్ ఖాయం!?

నేడో, రేపో బీఆర్ఎస్ నుంచి ప్రకటన!.. కీలక నేతలతో అధినేత కేసీఆర్ భేటీ

- ఉపేక్షిస్తే పార్టీకి మరింత నష్టం అనే అభిప్రాయం
- ఎక్స్‌లో కవితను అన్‌ఫాలో చేయాలని ఆదేశం
- టీఆర్ఎస్ఎల్పీ వాట్సప్ గ్రూప్ నుంచి కవిత పీఆర్వో అవుట్
- సస్పెండైతే తెలంగాణ జాగృతి పేరుతో కవిత సొంత పార్టీ?



హైదరాబాద్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సొంత పార్టీకి చెందిన నేతలు హరీశ్‌రావు, జోగినపల్లి సంతోష్ కుమార్‌పై ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చేసిన వ్యాఖ్యలను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తీవ్రంగా పరిగణిస్తున్నట్లు తెలుస్తోంది. కవిత తీరుతో పార్టీకి మరింత నష్టం జరిగేలోపే ఆమెను బీఆర్ఎస్ నుంచి సాగనంపాలనే నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. ఈ క్రమంలో పార్టీ నుంచి కవిత సస్పెన్షన్ ఖాయం అనే ప్రచారం బీఆర్ఎస్ వర్గాల్లో జోరుగా సాగుతోంది. దీనిపై ఒక ట్రెండు రోజుల్లో బీఆర్ఎస్ నుంచి అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మీడియా సమావేశంలో హరీశ్, సంతోష్‌పై కవిత సంచలన వ్యాఖ్యలు చేశాక.. ఆ పార్టీ సీనియర్ నేతలు ఎర్రవల్లిలోని కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు వెళ్లారు. అక్కడ కేటీఆర్, వేముల ప్రశాంత్ రెడ్డి, జగదీశ్ రెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డితో పాటు మరికొందరు కీలకనేతలు కేసీఆర్‌తో భేటీ అయ్యారు. పార్టీలో జరుగుతున్న పరిణామాలపై కేసీఆర్‌తో మంతనాలు జరిపారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. కవిత పార్టీలో ఉంటే లాభం ఉందా? అంటూ పార్టీ నేతలను కేసీఆర్ ప్రశ్నించారు. ఇంత పెద్ద వ్యాఖ్యలు చేశాక కూడా కవితను కొనసాగిస్తే పార్టీకి మరింత నష్టం అని, ఆమెను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని మెజారిటీ నేతలు కేసీఆర్‌కు సూచించారు. కవితను పార్టీలో కొనసాగితే విపక్షాలకు ఆయుధం ఇచ్చినట్లేనని నేతలు అభిప్రాయపడ్డారు. కవితపై ఎటువంటి చర్యలు తీసుకోకపోతే మున్ముందు మరింత నష్టం జరిగే ప్రమాదం ఉందని అధినేతకు చెప్పారు. కవిత ఇదివరకే.. కేసీఆర్ చుట్టూ దయ్యాలున్నాయంటూ వ్యాఖ్యానించారు. అప్పుడే ఆమెపై నిర్ణయం తీసుకుంటారని అంతా భావించారు. అయితే ఆమెపై ఎలాంటి చర్యలు తీసుకోకుంటేనే తక్కువ నష్టం జరుగుతుందనే భావన అప్పట్లో పార్టీ పెద్దల్లో ఉండిందని.. ఇప్పుడు చేయిదాటిపోయే స్థాయికి పరిస్థితి చేరిందని ఓ కీలక నేత చెప్పారు.

కవితపై బీఆర్ఎస్ నేతల మాటల దాడి

సామాజిక మాధ్యమాల్లో కవితను వెంటనే అన్‌ఫాలో కావాలని బీఆర్ఎస్ ఐటీ విభాగం నుంచి పార్టీ శ్రేణులకు ఆదేశాలు వెళ్లినట్లు గులాబీ వర్గాలు చెబుతున్నాయి. ఆ వెంటనే ఎక్స్ ఖాతాలో కవితను ఫాలో అవుతున్న కార్యకర్తలు వెంటవెంటనే అన్‌ఫాలో అయ్యారు. సామాజిక మాధ్యమాల్లో ఆమెకు వ్యతిరేకంగా కామెంట్లు పెట్టడం మొదలుపెట్టారు. ఎలక్ట్రానిక్ మీడియాలో బీఆర్ఎస్ తరఫున చర్చలకు వెళ్లిన నేతలు కూడా కవిత తీరును తీవ్రంగా తప్పుబట్టారు. కొందరైతే కవిత తీరు వల్లే గత ఎన్నికల్లో పార్టీ ఘోర పరాజయం పాలైందని ఆరోపించారు. మరికొందరు తక్షణమే ఆమె పార్టీకి, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ఎల్పీ వాట్సప్ గ్రూప్ నుంచి కవిత పీఆర్వోను తొలగించారు. హరీశ్‌రావు ఆరడుగుల బుల్లెట్ అంటూ బీఆర్ఎస్ సోషల్ మీడియా విభాగం పోస్టులు పెట్టింది. లండన్ పర్యటనలో ఉన్న హరీశ్‌రావుకు అక్కడి బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ విభాగం ఘనస్వాగతం పలికింది.

సస్పెండ్ చేస్తే సొంతపార్టీ?

బీఆర్ఎస్ నుంచి కవితను సస్పెండ్ చేస్తే .ఆమె అడుగులు ఎటువైపు? అన్న చర్చ రాజకీయ వర్గాల్లో మొదలైంది. అయితే మొదట్నుంచి ఆమె ఒక స్పష్టతతో ఉన్నారని, పార్టీ నుంచి బయటకు వెళ్లాల్సివస్తే, సొంత వేదిక ఏర్పాటు చేసుకోవాలని ముందే నిర్ణయం తీసుకున్నారని విశ్లేషకులు అంటున్నారు. 2023 ఎన్నికల్లో పార్టీ పరాజయం పాలైనప్పటి నుంచి ఆమె తన జాగృతి సంస్థను నెమ్మదిగా బలోపేతం చేస్తూ వస్తున్నారు. జాగృతి పేరుతో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పార్టీ పెడితే తెలంగాణ జాగృతినే పార్టీ పేరుగా ఖరారు చేసే అవకాశం ఉందని ఆమె సన్నిహితులు చెబుతున్నారు. కొత్త పేరు జోలికి వెళ్లకపోవచ్చని ఆ వర్గాలు అంటున్నాయి.

తెలంగాణ తల్లి చిత్రపటానికి

కాళేశ్వరం జలాలతో అభిషేకం



ఉట్నూర్‌లో తెలంగాణతల్లి చిత్రపటానికి కాళేశ్వరం జలాలతో అభిషేకం చేస్తున్న దృశ్యం

ఉట్నూర్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోనే అత్యంత అద్భుతమైన మానవ నిర్మాణంలో ఒకటైన కాళేశ్వరం ప్రాజెక్టు గురించి కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అసత్య ప్రచారానికి నిరసనగా బీఆర్ ఎస్వీ రాష్ట్ర కమిటీ, ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ ఆదేశాల మేరకు సోమవారం బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో తెలంగాణ తల్లి చిత్రపటానికి పాలతో అభిషేకం చేశారు. ఉ ట్నూరు మండల కేంద్రంలోని కొమరం భీం ప్రాంగణంలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ క ళాశాలలో బీఆర్ఎస్వి జిల్లా అధ్యక్షులు ధరణి రాజేష్ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి తెలంగాణ తల్లి చిత్రపటానికి కాళేశ్వరం నదీ జలాలతో జలభిషేకం చేసి నిరసన తెలిపారు. ఈసందర్భంగా ధరణి రాజేష్ మాట్లాడుతూ బిఆర్ఎస్ అధినేత మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ముందుచూపు తెలంగాణ సాధనలో భాగమైన నీళ్ల సమీకరణ కోసం తానే భగీరథ సంకల్పం చేసి తెలంగాణలోన్ని కొన్ని వేల ఎకరాలకు సాగునీరు తాగునీరు అందించే సంకల్పంతో నిర్మించిన అద్భుత కట్టడం కాళేశ్వరం ప్రాజెక్టు గురించి కాంగ్రెస్ పార్టీ అసత్య ప్రచారాలు మానుకోవాలన్నారు. కాంగ్రెస్ నాయకుల కళ్ళకి మాత్రం ఈ అభివృద్ధి అద్భుతం కనపడకపోవడం ఒక దౌర్భాగ్యమని ధరణి రాజేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ యువజన మండల ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ముజీబ్, షేక్ సాజిద్, సాయి, కేశవ్ పాల్గొన్నారు.

పబ్లిక్ స్కూల్ ప్రవేశాల్లో ఆదివాసీలకు అన్యాయం

ఉట్నూర్, సెప్టెంబర్ (ఆంధ్రజ్యోతి):గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్ రామంతపూర్ పబ్లిక్ స్కూల్ ప్రవేశాలలో గిరిజన సంక్షేమ శాఖ అధికారులు ఆదివాసీలకు అన్యాయం చేస్తునారన్ని తుడుం దెబ్బ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పురక బాపురావు ఆరోపించారు. సోమవారం హైదరాబాదులోని బేగం పేట, రామంతపూర్ పబ్లిక్ స్కూల్ ప్రవేశాల కోసం హైదరాబాద్ కలెక్టరేటు నిర్వహించిన లక్కీ లాటరీలలో ఆదివాసులు 9 తెగలకు కేవలం 5 సీట్లు, లంబాడీలకు 13, పీవీటీజీలకు ఒకటి, ఎరుకల, యానాది లకు రెండు సీట్లు కేటాయించారన్నారు. ఆదివాసుల పక్షాన ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తుందని, దీనిని సరిచేసి ఆదివాసీలకు అదనపు సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు.

కదిలిలో భక్తుల సందడి



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సతీమణి కవిత

దిలావర్‌పూర్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పురాతన పుణ్యక్షేత్రం శ్రీ కదిలి పాపహరేశ్వర స్వామి దేవస్థానం భారీగా వచ్చిన భక్తులతో సందడిగా మారింది. జిల్లా నలుమూలల నుంచే కాకుండా కరీంనగర్, జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, ఆర్మూర్, నిజామాబాద్ ప్రాంతాల నుంచి ప్రైవేట్ బస్సుల్లో మహిళలు భారీగా తరలివచ్చారు. పాప హరేశ్వర స్వామిని, మాతాన్నపూర్ణేశ్వరి దేవిని, మహా వట వృక్షాన్ని దర్శించుకుని పూజలు చేశారు. దేవస్థానంలో అన్న ప్రసాదం స్వీకరించిన అనంతరం మహారాష్ట్రలోని పాలాజ్ గణపతిని దర్శించుకునేందుకు బయలుదేరి వెళ్లారు.

ఎమ్మెల్యే సతీమణి ప్రత్యేక పూజలు..

నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి సతీమణి ఏలేటి కవితా రెడ్డి సోమవారం కదిలి పాపహరేశ్వ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీ మాతాన్న పూర్ణేశ్వరి దేవిని దర్శించుకున్నారు. కుంకుమార్చన పూజలు చేశారు. బీజేపీ నాయకులు డి.ముత్యంరెడ్డి, ఉత్తం పటేల్, ధని నర్సయ్య, సాయినాథ్, తదితరులు ఉన్నారు.

సరస్వతి చెరువుకు గండి

- అప్రమత్తమైన అధికారులు
- సమాచారం ఇచ్చిన గంగపుత్రులు



సరస్వతి చెరువుకు గండిని తాత్కాలికంగా పూడుస్తున్న గంగపుత్రులు



సరస్వతి చెరువుకు గండిపడ్డ దృశ్యం

ఉట్నూర్, సెప్టెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): కొన్ని రోజులుగా కురుస్తున్న ఎడతెరిపిలేని వర్షాలకు చెరువుల్లో సమృద్ధిగా నీరు చేరుతుంది ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు కురిసిన వర్షానికి మండలంలోని పాత ఉట్నూర్ సమీపంలో ఉన్న సరస్వతి చెరువుకు గండి పడింది. మండలంలో 40.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయినప్పటికి ఎక్కడ ఎలాంటి నష్టం జరగలేదని అధికార వర్గాలు పేర్కొనగా సరస్వతి చెరువుకు పడిన గండి విషయం మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అనిత సందర్శించారు. సోమవారం ఉదయం అటు వైపుగా వచ్చిన పశువుల కాపరి ఒకరు చేరువుకు గండి పడిందని గంగపుత్రులకు సమాచారం అందించడంతో చెరువులోని చేప పిల్లలు పోకుండా ఉండడానికి గంగపుత్రులు అప్రమత్తమై చెరువు వద్దకు చేరుకొని గండి పడిన ప్రదేశం నుంచి వరద నీరు పోకుండా ఉండ డం కోసం ఇసుక సంచులను పెట్టి గండి వద్ద నీరు నిలిచే విధంగా ప్రయత్నం చేశారు. మండల బీజేపీ అధ్యక్షుడు బింగి వెంకటేష్ ఇరిగేషన్ డిప్యూటీ ఈఈ రాథోడ్ వినోద్‌కు సమాచారం అందించడంతో ఆయన ఏఈఈ రాజేశ్వరిని వెంట బట్టుకొని చెరువుకు గండి పడ్డ ప్రాంతాన్ని పరిశీలించారు. వెంటనే సదురు గండిని పూడ్చడానికి యుద్ధ ప్రాతిపదక పైన చర్యలు చేపట్టి జేసీబీ సహాయంతో గండి ప్రాంతాన్ని మూసివేయించారు. చెరువు మరమ్మతులు పనులు పూర్తి చేయిస్తామని డీఈఈ వినోద్ రాథోడ్ తెలిపారు.

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



బండ పాటగూడలో వైద్య శిబిరం ఏర్పాటు చేసిన వైద్య సిబ్బంది

ఇంద్రవెల్లి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి డాక్టర్ ప్రతాప్‌నాయక్ అన్నారు. పిట్ట బొంగురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని బండ పాటగూడ గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య శిబిరంలో 23 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఆరు మంది నుండి రక్త నమూనాలు సేకరించారు. వర్షాకాలంలో మలేరియా, డెంగ్యూ, విరేచనాలు, చికున్ గున్యా వంటి సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఈవో రాథోడ్ గోకుల్, హెచ్ఎస్ గంగమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ ప్రియాంక, ఏఎన్ఎం శివ రంజని, హెచ్ఏ విజయ్, తదితరులు పాల్గొన్నారు.

పిప్రి రోడ్డు సమస్యను పరిష్కరించండి

ముథోల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పిప్రి గ్రామానికి వెళ్లే రోడ్డు సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు సోమవారం తహసీల్దార్ శ్రీలతకు వినతి పత్రం అందజేశారు. భైంసా-బాసర జాతీయ రహదారి నుంచిచి పిప్రి గ్రామానికి వెళ్లే రోడ్డు మధ్యలో చిన్నపాటి వర్షంతో నీళ్లు నిల్వ ఉంటుండటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు పేర్కొన్నారు. నిల్వ ఉన్న నీటిని తొలగిస్తే కొంత మంది తమను బెదిరిస్తున్నారని గ్రామస్థులు ఆరోపించారు. తక్షణమే మా సమస్యను పరిష్కరించాలని వారు కోరారు.

వరద బాధితులకు బాలకృష్ణ విరాళంపై హర్షం

నిర్మల్‌రూరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న తెలంగాణ రైతాంగానికి, పేద ప్రజలందరికీ సినీ హీరో, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ 50 లక్షల విరాళం ప్రకటించినందుకు ఆల్ ఇండియా ఎన్‌బీకే ఫ్యాన్స్ కన్వీనర్ జీఎల్ శ్రీధర్, జిల్లా ఎన్‌బీకే ఫ్యాన్స్ అధ్యక్షులు ఆకోజి కిషన్ హర్షం వ్యక్తం చేశారు.

స్వచ్ఛంద రక్త దానం ప్రతీ ఒక్కరి బాధ్యత



రక్తదాన శిబిరంలో పాల్గొన్న ఎస్సై సాయి కుమార్

దస్తురాబాద్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛంద రక్త దానం ప్రతీఒక్కరి బాధ్యత అని స్థానిక ఎస్సై సాయి కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం స్థానిక రామ్‌సేన యూత్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తాన్ని దానం చేశారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ రక్తదానం ద్వారా అనేక మందికి ప్రాణాలు కాపాడవచ్చు. ఇది అత్యంత మానవతా కర్తవ్యం అని అన్నారు. యువత ముందుకు రావడం సమాజానికి ఆదర్శమని ప్రశంసించారు. సామాజిక సేవలో భాగంగా ప్రతిఒక్కరూ సంవత్సరంలో కనీసం రెండుసార్లు రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు.

కస్తూర్బా పాఠశాల తనిఖీ



కస్తూర్బా పాఠశాలను తనిఖీ చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో ఆకాష్

భైంసా రూరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): భైంసా పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను డిప్యూటీ డీఎంహెచ్‌వో ఆకాష్ సోమవారం తనిఖీ చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు విద్యార్థులు జ్వరాలు, సీజనల్ వ్యాధుల బారిన పడే అవకాశముందని, ఈ నేపథ్యంలో పాఠశాల పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. అలాగే విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అంతకుముందు పాఠశాలలో సరుకులు, కూరగాయలు పరిశీలించారు. వంట గది ఆవరణ శుభ్రంగా ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు కమలేష్, సీహెచ్‌వో గంగాధర్, వైద్య సిబ్బంది, పాఠశాల ఎస్‌వో జ్యోతి ఉన్నారు.

జవాన్ కుటుంబాన్ని పరామర్శించిన మాజీ కేంద్ర మంత్రి

ముథోల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : దేశ వైమానిక దళం న్యూ ఢిల్లీలో పనిచేస్తున్న తరోడా గ్రామానికి చెందిన జవాన్ లక్ష్మీ ఈశ్వర్ ప్రసాద్ ఇటీవల ప్రమాదవశాత్తు వాటర్ ఫాల్‌లో పడి మృతి చెందాడు. సోమవారం రాత్రి కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాల చారి, ముథోల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే నారాయణ రావు పటేల్‌లు జవాన్ కుటుంబ తల్లిదండ్రులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు రావుల గంగారెడ్డి, శ్రీనివాస్, ప్రేమ్‌నాథ్ రెడ్డి, పతంగి కిషన్, అజీజ్, తదితరులున్నారు.

andhrajyothy.com
ఆంధ్రజ్యోతి

నిర్మల్ జిల్లా వార్తలు
8
మంగళవారం 2 సెప్టెంబరు 2025

బినామీ ఖాతాలతో గోల్‌మాల్

- మ్యూల్‌బ్యాంకు అకౌంట్ల పేరిట భారీ టర్నోవర్‌లు
- ఆన్‌లైన్ బెట్టింగ్, మట్కా దందా కోసం ఉపయోగం
- హవాలా దందాపై గతంలో దర్యాప్తు చేసిన సీఎస్‌బీ
- బెట్టింగ్ రాకెట్ గుట్టురట్టుతో బయటపడిన వాస్తవాలు

నిర్మల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లాలో ఆన్‌లైన్ బెట్టింగ్, హవాలా దందా కోసం పెద్ద ఎత్తున బినామీ బ్యాంక్ అకౌంట్‌ల వ్యవహారం కొనసాగుతున్నట్లు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. కొంతమంది ఆన్‌లైన్ బెట్టింగ్ దందా కొనసాగించే బుకీలు బినామీల పేరిట వందల సంఖ్యలో బినామీ అకౌంట్‌లను వివిధ బ్యాంకుల్లో ఓపెన్ చేస్తున్నట్లు చెబుతున్నారు. అమాయకులను లక్ష్యంగా చేసుకొని సైబర్ నేరగాళ్లు వారి పేరిట బ్యాంకు అకౌంట్లు ఓపెన్ చేసి వారికి కొంత మొత్తాన్ని లాభంగా చెల్లిస్తున్నారు. వీరి బ్యాంకు ఖాతాలపై కోట్ల రూపాయల టర్నోవర్‌ను సాగిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. బెట్టింగ్‌లు, మట్కా, హవాలా దందాలో వచ్చే డబ్బులను అమాయకుల ఖాతాలో వారికి తెలియకుండానే జమ చేస్తూ ఆ డబ్బులను డ్రా చేస్తున్నారు. ఇటీవల క్రితం నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిల ఆధ్వర్యంలో భైంసా కేంద్రంగా కొనసాగుతున్న ఆన్‌లైన్ బెట్టింగ్ దందా గుట్టు రట్టైన సంగతి తెలిసిందే. ఆన్‌లైన్ బెట్టింగ్ దందాకు సూత్రధారిగా భైంసాకు చెందిన సయ్యద్‌ఆజాం కొనసాగుతున్నట్లు గుర్తించిన పోలీసులు ఆయన నిర్వహిస్తున్న మీసేవ కేంద్రంపై దాడి జరిపారు. ఈ దాడిలో కళ్లు చెదిరే విధంగా సయ్యద్ ఆజాం వద్ద దాదాపు కోటిన్నర నుంచి రెండు కోట్ల రూపాయల విలువైన నగదు, బంగారం, వివిధ ఆస్తులకు సంబంధించిన డాక్యుమెంట్లు లభించాయి. వీటితో పాటు పెద్దఎత్తున ఆధార్ కార్డులు, పాన్ కార్డులతో పాటు బ్యాంకు అకౌంట్ పాస్‌పుస్తకాలు సైతం పోలీసులకు లభ్యమయ్యాయి. బెట్టింగ్‌తో పాటు ఆన్‌లైన్ జూదం, హవాలా వ్యాపారం, మట్కా లాంటి అక్రమ దందాల టర్నోవర్ డబ్బులను కూడా సయ్యద్ ఆజాం నేతృత్వంలోని సైబర్ క్రిమినల్స్ కొత్త పంథాలో దారి మళ్లిస్తున్నారు. ఈ సైబర్ క్రిమినల్స్ ఎవరికి అనుమానం రాకుండా అమాయకుల పేరిట మ్యూల్ అకౌంట్లు తెరిపిస్తూ ఆ అకౌంట్‌ల పేరిట కోట్ల రూపాయల టర్నోవర్ చేస్తున్నారు. గత సంవత్సరం తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీఎస్‌సీబీ) అధికారులు భైంసా కేంద్రంగా సాగుతున్న ఈ మ్యూల్ అకౌంట్‌ల భాగోతాన్ని బట్టబయలు చేసింది. బెట్టింగ్, హవాలా దందాలతో సమకూరే కోట్ల రూపాయలను సైబర్ నేరస్తులు ఎవరికి అను వ రా న ం రాకుం డా దూర ప్రాంతాల్లోని అమాయక మ్యూల్ ఖాతాదారుల అకౌంట్‌లలో డబ్బులు వేసి


స్వాధీనం చేసుకున్న డబ్బు, నగలు (ఫైల్)

వాటిని మళ్లీ వారే ఆ అకౌంట్‌ల నుంచి డ్రా చేసుకుంటున్న ట్లు పోలీసులు నిర్ధారించారు. అయితే సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులకు అందిన సమాచారం మేరకు వారు భైంసా పట్టణంపై దృష్టి సారించారు. భైంసా పట్టణానికి చెందిన షిండే ప్రణయ్ అనే వ్యక్తి కొంత కాలం నుంచి ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ జూదాన్ని నిర్వహిస్తున్నట్లు అధికారులు పసిగట్టారు. ఈయనపై దృష్టి సారించడంతో మ్యూల్ అకౌంట్‌ల గుట్టు రట్టయింది. షిండే ప్రణయ్ దాదాపు ఈ ప్రాంతానికి చెందిన 125 మంది అమాయకుల పేరిట మ్యూల్ అకౌంట్లను వివిధ బ్యాంకుల్లో తెరిపించినట్లు అధికారులు గుర్తించారు. అప్పట్లో ఈ వ్యవహారం సద్దుమణిగినప్పటికీ కొద్ది రోజుల తర్వాత నుంచి మళ్లీ ఆన్‌లైన్ బెట్టింగ్ దందాను సయ్యద్ ఆజాంతో పాటు మరికొంత మంది మొదలుపెట్టారు. వీరు కూడా గతంలో మాదిరిగానే అమాయకులను బుట్టలో వేసుకొని వారికి కొంత మొత్తం చెల్లిస్తూ వారి పేరిట మ్యూల్ అకౌంట్‌లను ఓపెన్ చేసి ఆన్‌లైన్ బెట్టింగ్ ద్వారా వచ్చే లక్షల రూపాయలను టర్నోవర్ సాగించారు.


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ డాక్టర్ జానకి షర్మిల (ఫైల్)

అమాయకులే బినామీలు...

ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్, మట్కా లాంటి దందాల తో సంబంధాలున్న మీసేవా నిర్వాహకుడు సయ్యద్ ఆజాం అమాయకులను లక్ష్యంగా చేసుకుంటూ వారి పేరిట మ్యూల్‌అకౌంట్‌లు తెరిపిస్తున్నారు. ఆజాం ఆల్ ప్యానెల్ డాట్ కామ్ అనే బెట్టింగ్ యాప్‌లకు టెలిగ్రామ్ యాప్ ద్వారా కస్టమర్లను తయారు చేసుకుంటున్నాడు. ఇలా యాప్ ద్వారా ఒక్కో కొత్త కస్టమర్‌కు సంబంధించి ఆయనకు పెద్దమొత్తంలో సైబ ర్ క్రిమినల్స్ కమీషన్‌లు చెల్లిస్తున్నట్లు చెబుతున్నారు. యాప్ ద్వారా కస్టమర్లుగా అయిన వారి పేరిట బ్యాంకు ఖాతాలు తెరిపి ఒక్కో ఖాతాదారుడికి ఐదు వేల రూపాయలు చెల్లించి పాస్ బుక్కు లు, చెక్‌బుక్కులు, ఏటీఎం కార్డులను వారి నుంచి తీసుకుంటున్నట్లు పేర్కొంటున్నారు. కేవలం బ్యాంకు ఖాతా తెరిచే వరకే కస్టమర్లతో సంబంధం ఉంటుందని ఆ తర్వాత వారితో సంబంధం లేకుండానే వారి ఖాతాల ద్వారా లావాదేవీలు సాగుతాయంటున్నారు. కాగా మ్యూల్ అకౌంట్‌దారులకు సంబంధించిన ఫోన్ నెంబర్లను కూడా సయ్యద్ ఆజాం తానే ఇచ్చేవాడని తెలుస్తోంది. ఒక్కో ఖాతాదారుడికి సంబంధించిన సెల్‌ఫోన్ సిమ్‌ను ఇతరుల పేరిట తీసుకొని ఆ నెంబర్‌ను బ్యాంకు అకౌంట్‌కు లింక్ చేయించేవాడని చెబుతున్నారు. ఈ సెల్‌ఫోన్ సిమ్‌లను ఆజాం తన వద్దనే ఉంచుకున్నట్లు కూడా అధికారులు గుర్తించారు. ఆయన వద్ద నుంచి సిమ్‌కార్డులు, ఆధార్‌కార్డులు, పాన్‌కార్డులు, బ్యాంకు పాస్ బుక్కులు స్వాధీనం చేసుకున్నారు.

మ్యూల్ అకౌంట్‌ల పేరిట వ్యవహారం...

గత కొంత కాలం నుంచి సైబర్ క్రిమినల్స్ పెద్ద ఎత్తున మ్యూల్ అకౌంట్‌ల ద్వారా అక్రమ లావాదేవీలు సాగిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ముఖ్యంగా కొన్ని పట్టణాల్లో కొత్తగా ఏర్పాటవుతున్న వివిధ బ్యాంకులకు సంబంధించిన బ్రాంచీలలో ఈ మ్యూల్ అకౌంట్‌లు తెరిపిస్తున్నట్లు పేర్కొంటున్నారు. వివిధ బ్యాంకులకు సంబంధించిన కొత్త బ్రాంచీలలో కస్టమర్ల సంఖ్య పెంచేందుకు అక్కడి అధికారులకు టార్గెట్‌ను నిర్ణయిస్తారు. దీంతో వారు ఆధార్ కార్డు, ఇతర వివరాలన్నీ సక్రమంగా ఉన్నవారికి అప్పటికప్పుడే బ్యాంకు అకౌంట్లు తెరుస్తున్నారు. ఇటీవల ప్రతి లావాదేవీకి బ్యాంకు అకౌంట్ తప్పనిసరి కావడంతో మ్యూల్ అకౌంట్‌లు తెరిపించడం అక్రమార్కులకు సులభంగా మారిందని అంటున్నారు. గత కొంత కాలం క్రితం కొన్ని ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్‌ల కోసం కూడా విద్యార్థుల పేరిట అకౌంట్‌లు తెరిపించి వాటన్నింటినీ తమ వద్దనే ఉంచుకునే వారని చెబుతున్నారు. ఈ అకౌంట్‌లో జమ అయ్యే డబ్బుల వివరాలు విద్యార్థులకు తెలియకపోయేదని చెబుతున్నారు. ఆ అకౌంట్ పాస్ బుక్కులు, ఏటీఎం కార్డులను తమ వద్దనే ఉంచుకొని డబ్బులు జమ కాగానే వాటిని కాలేజీల యాజమాన్యాలు డ్రా చేసుకునే వారని సమాచారం. అదే తరహాలో సైబర్ నేరస్తులు కూడా మ్యూల్ అకౌంట్లు తెరుస్తూ పెద్ద మొత్తంలో అక్రమ లావాదేవీలు సాగిస్తున్నారంటున్నారు.

త్వరితగతిన పరిష్కరించాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్


ప్రజావాణి దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ రూరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణి దరఖాస్తును పరిశీలించి తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశమందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని, ప్రజల ఫిర్యాదులను స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించాలన్నారు. ప్రజావాణి అనంతరం కలెక్టర్ సమీక్షిస్తూ అధికారులు వరద సమయంలో తీసుకున్న తగుచర్యలను ప్రశంసిస్తూ, ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు అనారోగ్య సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. అదనంగా వరద నష్టనివేదికలు సిద్ధం చేయడం, ఇందిరమ్మ ఇళ్లనిర్మాణంలో వేగం పెంచడం, ప్రధానమంత్రి ఆవాస్ యోజనకు సంబంధించిన లబ్ధిదారుల ఎంపిక సర్వేను త్వరితగతిన పూర్తిచేయడం, వన మహోత్సవంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని పూర్తిచేయడం, ప్రభుత్వబడులను ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. ప్రజావాణిలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్‌కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జిల్లాలో యూరియా కొరత లేదు

జిల్లాలో రైతులకు యూరియా ఎరువుల కొరత లేదని కలెక్టర్ అభిలాష అభినవ్ స్పష్టం చేశారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. జిల్లాలో అవసరమైనంత మోతాదులో యూరియా నిల్వలు ఉన్నాయని, రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఎరువుల దుకాణాలను ఉదయం 8 గంటలకు తెరిపిస్తున్నామని చెప్పారు. రైతులు ఒకేసారి గుంపులుగా దుకాణాలకు వెళ్లకుండా విడతల వారీగా వెళ్లి అవసరమైనంత మేరకు మాత్రమే కొనుగోలు చేయాలని సూచించారు. యూరియా కొరతపై అసత్యప్రచారాలను రైతులు నమ్మవద్దని, జిల్లాలోని ప్రతి రైతు అవసరానికి తగ్గట్టుగానే యూరియా అందించడానికి చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. ఎరువుల సరఫరా పర్యవేక్షణకు వ్యవసాయ శాఖ అధికారులు నిరంతరం కట్టుదిట్టంగా పర్యవేక్షిస్తున్నారని కలెక్టర్ తెలిపారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్‌డే

- ఎస్పీ డా.జి.జానకి షర్మిల

నిర్మల్‌రూరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్‌డే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎస్పీ జానకిషర్మిల తెలిపారు. సోమవారం జిల్లా పోలీసు ముఖ్య కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి నిర్మల్ డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి, వెంటనే ఫిర్యాదుదారుల ముందే సంబంధిత పోలీస్‌స్టేషన్‌ల అధికారులకు ఫోన్‌ల ద్వారా బాధితులకు చట్టపరంగా అందాల్సిన సహాయాన్ని అందిస్తూ వారి సమస్యలను పరిష్కరించాలని ఎస్పీ ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... ప్రజలకు పోలీసుసేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేశామని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీసుస్టేషన్‌కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్రస్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారుడికి పోలీసుశాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డేలో వచ్చిన ఫిర్యాదులు ఆన్‌లైన్‌లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో అని ఎప్పటికప్పుడు సమీక్షించుకుం టూ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందిస్తామన్నారు.

వినాయక ఉత్సవాలు


తానూర్ బోసి గ్రామంలో సాంస్కృతిక కార్యక్రమాలలో విద్యార్థులు


దిలావర్‌పూర్‌లో ఏఎస్పీని సన్మానిస్తున్న ఉత్సవ నిర్వాహకులు


మాదెగాంలో గణపతి శోభాయాత్రలో నృత్యాలు చేస్తున్న చిన్నారులు


ముథోల్‌లో భక్త తుకారాం రూపంలో గణేష్

బీసీ బిల్లు ఆమోదం చరిత్రాత్మక విజయం

- డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరి రావు


సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు శ్రీహరి

నిర్మల్ రూరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : అసెంబ్లీలో బీసీ బిల్లు ఆమోదం చరిత్రాత్మక విజయమని డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరి రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ విశ్రాంతి భవనంలో సోమవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ... పంచాయతీ రాజ్ చట్ట సవరణ, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లులను శాసన సభ ఆమోదించడంపై హర్షం వ్యక్తం చేశారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని నెరవేర్చే దిశగా అడుగులు వేస్తోందన్నారు. బీసీలకు న్యాయం చేసే దిశగా కాంగ్రెస్ ముందుకు వెళ్తుంటే బీఆర్‌ఎస్, బీజేపీ అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు.విలేకరుల సమావేశంలో పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంభూపాల్, ఎంబడి రాజేశ్వర్లతో పాటు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అర్జుమన్ అలీ, నిర్మల్ మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ్ రెడ్డి, సారంగాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ హాది నాయకులు ఎర్రవోతు రాజేందర్ పాల్గొన్నారు.

ఖానాపూర్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు బిల్లును అసెంబ్లీ ఆమోదించడం అభినందనీయమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దొనికెని దయానంద్ అన్నారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని తెలంగాణ తల్లి చౌరస్తాలో కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అబ్దుల్ మాజీద్, ఆత్మ కమిటీ చైర్మన్ తోట సత్యం, పీఏసీఎస్ చైర్మన్ ఆమంద శ్రీనివాస్, మాజీ మున్సిపల్ చైర్మన్లు రాజుర సత్యం, అంకం రాజేందర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కడార్ల గంగనర్సయ్య, కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి షబ్బీర్ పాషా తదితరులున్నారు.

గేదెలను కాపాడిన గంగపుత్రులు


గోదావరి నది నుంచి గట్టుకు వస్తున్న గేదెలు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే

లక్ష్మణచాంద, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మునిపెల్లి, పార్పెల్లి తండా గ్రామాలకు చెందిన 170 గేదెలు సోమవారం క్షేమంగా ఇంటికి చేరాయి. గోదావరి మధ్యలోని గడ్డి భూమికి గతనెల 27న మేతకు వెళ్లిన ఈ గేదెలు ప్రవాహం నిండుగా ఉండటం వలన ఐదు రోజులుగా అక్కడే ఉండిపోయాయి. గేదెల పిల్లలు తల్లుల కోసం అరుస్తూ గడపగా సంబంధిత రైతులు గేదెలను కాపాడాలని ఆవేదన వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. రైతుల వేదనకు స్పందించిన నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఎస్సారెస్పీ అధికారులకు ఫోన్ చేసి నీటి ప్రవాహం తగ్గేలా చేశాడు. దీంతో మునిపెల్లి గ్రామానికి చెందిన బొడ్డు చిన్న సాయన్న, బొడ్డు ఆశన్న, పల్లికొండ శ్రీను, బొడ్డు మైరామన్న, చైర్మన్ సాయన్న అనే ఐదుగురు గంగపుత్ర సభ్యులు తమ ప్రాణాలకు తెగించి తెప్పలపై వెళ్లి గేదెలన్నింటినీ క్షేమంగా ఒడ్డుకు చేర్చారు.

పంట నష్టపరిహారం అందివ్వాలని వినతి

ముథోల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాల కారణంగా రైతులు తీవ్రనష్టపోయారని, నష్టపరిహారం చెల్లించాలని ఆష్టా గ్రామ రైతులు తహసీల్దార్ శ్రీలతకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షంతో పంటలు తీవ్రంగా నష్టపోయాయని వినతిపత్రంలో వారు పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం అందించి, రైతులను ఆదుకోవాలని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతులు ముత్యం, అజయ్ రెడ్డి, నలీం, అశోక్, రాజేశ్వర్, రాజన్న తదితర రైతులున్నారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్థులు

అమ్మవారిని దర్శించుకున్న వేణుగోపాలచారి


అమ్మవారి క్షేత్రంలో వేణుగోపాలచారి

బాసర, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : బాసర సరస్వతీ అమ్మవారిని సోమవారం కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలచారి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం మాట్లాడుతూ బాసరలో వరద వలన నష్టపోయిన వారిని ప్రభుత్వం ఆదుకుంటుందని హామి ఇచ్చారు. అదే విధంగా త్వరలోనే అమ్మవారి ఆలయ మాస్టర్ ప్లాన్ అమలు అవుతుందని, ఆలయ అభివృద్ధి నిధుల గురించి ప్రభుత్వంతో చర్చించినట్లుగా తెలిపారు. ఈయన వెంట మాజీ సర్పంచ్ మమ్మాయి రమేష్, కాంగ్రెస్ పార్టీ మాజీ జనరల్ సెక్రెటరీ సంజీవ్‌రావు దేశాయి, ఎన్‌ఎస్‌యూఐ సుద్దోల్ల గంగాప్రసాద్, తదితరులున్నారు.

బాసరలో పర్యటించిన మాజీ ఎమ్మెల్యే


దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే

బాసర, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : బాసర మండలంలో సోమవారం మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పర్యటించారు. ఇటీవల కురిసిన భారీవర్షాల వలన నష్టపోయిన బాధితులను పరామర్శించారు. మండలంలోని కిర్గుల్(కే), కిర్గుల్(బీ), కౌట గ్రామంలో పర్యటించారు. భారీవర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. రైతులకు భరోసా కల్పించారు. ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లి నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా ఉండే విధంగా చూస్తానన్నారు. ఈయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలున్నారు.

ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుంది


ముథోల్‌లో పంటలను పరిశీలిస్తున్న మాజీ కేంద్ర మంత్రి చారి

ముథోల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పంటలు నష్టపోయిన రైతులు అధైర్య పడవద్దని కాంగ్రెస్ ప్రభుత్వం తప్పక ఆదుకొని అండగా నిలుస్తుందని కేంద్ర మాజీమంత్రి వేణుగోపాల చారి అన్నారు. మండల కేంద్రమైన ముథోల్‌లో సోమవారం సాయంత్రం ఇటీవల కురిసిన భారీవర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలను అలాగే రోడ్డును ముథోల్ మాజీఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి నారాయణరావు పటేల్‌తో కలిసి పరిశీలించారు. రైతులకు పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతులు తమ నష్టపోయిన పం టల వివరాలను సంబంధిత అధికారులకు తెలియజేయాలని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే నారాయణ రావు పటేల్, ఆత్మ చైర్మన్ నర్సారెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గంగారెడ్డి, రావుల శ్రీనివాస్, ఖలీద్ పటేల్, ప్రేమ్‌నాథ్ రెడ్డి, నాగేష్, పతంగి కిషన్, కిషన్ పటేల్, అజీజ్, దిగంబర్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.